# డయాస్పోరా కథల పరిణామం

తెలుగు భాషాభిమానులకు నమస్కారం

ప్రతీ కథ వెనక ఒక కథ ఉన్నట్టే నేను ఈ విషయం పై మాట్లాడడానికి, కూడా ఓ చిన్న నేపథ్యం ఉంది

1998లో అమెరికా కి వచ్చాను. రావడానికి ముందు ఓ పది , పదిహేను కథలు భారతదేశంలో వివిధ పత్రికల్లో  అచ్చయ్యాయి. అలానే 1998 తరువాత ఓ ఇరవై కథలు అమెరికా వివిధ వెబ్జైన్ లలో ప్రచురింప బడ్డాయి.

ఈ కథలన్నీ కలిపి ఒక పుస్తకం, అచ్చు వేయించాలని  ప్రతి రచయితకూ ఉన్నట్లే,  నాకు ఈ మధ్య చిరు ఆశ కలిగింది. సరే అని,  కథలు తీసుకొని పిడిఎఫ్ గా మార్చి అచ్చు తప్పులు ఎడిట్ చేస్తూ ఉంటే నాకు తెలియకుండానే,   నా  కథల్లో ద్వారా మరోసారి నేను ముప్పై ఏళ్ళు ప్రయాణం చేయడం జరిగింది..

నా  కథలు చాల మటుకు   ఓ అతర్ముఖుడి    అంతర్మదనం చిత్రీకరణలే. కథా వస్తువు సంఘంలో వస్తున్న మార్పులు, పిల్లల పెంపకం, ఆఫీస్ లో జరుగుతున్న విషయాల గురించి, మేనేజ్మెంట్ పాఠాల నుండి తీసుకున్నవి. కాకపోతే, కాలం గడిచే కొద్దీ సంఘంలో వస్తున్న మార్పులపైనే   కథలు రాయడం ఎక్కువైనది. అది వయస్సు తో వచ్చే జీవన మార్పుల వలనే కావచ్చును .

ఇలాంటి విశ్లేషణ మిగిలిన రచయితలు కూడా చేసారా? వారి అభిప్రాయం కూడా కనుక్కుందామని,   నాతోపాటు నా లాగానే  ఓ 30 ఏళ్లు సాహితీ ప్రయాణం చేస్తున్న వారిని,  కొంతమందిని ప్రశ్నించాను. కొందరు పెద్ద మార్పులేమి లేదని, శిల్పం తో సహా కథలు అలానే రాస్తున్నామని చెప్పారు. మరి కొందరు,  సంఘంలోని మార్పుల బట్టి,  తమ అవగాహన బట్టి,  తప్పకుండా రచనలలో  మార్పులు వస్తుంటాయి అని అభిప్రాయపడ్డారు. రెండవ కోవ వారే ఎక్కువ అని, నా అభిప్రాయం. వారి రచనలు నేను అప్పటికప్పుడు చదువుతూనే వస్తున్నాను కాబట్టి, వారి అభిప్రాయాలతో ఏకీభవిస్తాను. మనకు తెలిసిన రచయిత, రచయిత్రు లలో బహుశా ఒకరో ఇద్దరు తప్పితే, తమ పాత రచనలు తిరుగా తోడు తీసి మళ్ళి కొత్తగా రాసిన దాఖలాలు లేవు.

ఈలాంటి  విశ్లేషణ, అమెరికా డయాస్పోరా కథల పైన చేయాలంటే, వంగూరి ఫౌండేషన్ వారు ప్రచురించిన కథా సంపుటాలు ఓ ఖాజానసే. 1995 లో మొట్ట మొదటి సంకలనం వెలువడిన తరువాత, మారో 13 సంపుటాలు ప్రచురించారు. 14వ సంకలనం గత సంవత్సరం వెలువడింది.

మొదటి సంకలనం లోనే సంపాదకులు డా.  పెమ్మరాజు వేణుగోపాల్ రావు కథలను పరిచయం చేస్తూ,  'కథానిక తత్వ విచారణ'   పేరుతో చేసిన విశ్లేషణ తప్పక చదవాల్సిన అంశం. అప్పటికే ఆయన కథలను, ఆంతరిక సమస్యలు , మరపురాని మన దేశం,  కొత్త అనుభవాలు, కేవలం కల్పితం అని నాలుగు విభాగాలుగా ప్రచురించడం ఆయనకు సాహిత్యం పైన ఉన్న పట్టుకి, ముందు చూపుకు నిదర్శనం.

అలాంటి పరిచయం, విభాగాలు మిగిలిన ప్రచురణలలో లేకపోవడం మొదటి సంపుటి చదివిన   వారికి కొంత వెలితిగా కనపడితే ఆశ్చర్య పడనవసరం లేదు.

నాదగ్గర ఉన్న సంపుటాలలో ఉన్న కథలను మొదటి సంపుటంలాగానే  విభజించి చూశాను. కొట్టొచ్చిన విషయం, మొదటి సంపుటంలో మూడోవంతు  కథలు మరపురాని మన దేశం పైన ఉంటే, ఇప్పటికి ఆ విభాగానికి అదే నిష్పత్తి ఉండడం. కాదంటే  మొదటి సంపుటంలో మన దేశం పై కథలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పుడు ఆ స్థానం   కొత్త ఆనుభవాల మీద రాసిన కథలు  దక్కించుకున్నాయి. మరో విషయం ఇటీవల కథలు అమెరికాను మన దేశం గా రూపాంతరం చేసుకున్నాయి. నా కథలో ఉన్న ఓ పాత్ర అమెరికా జెండా చూసి మన దేశం జెండా అని గర్వ పడడం, నాకు ఓ పాఠకుడు చెప్పిన తరువాతే నాకీ మార్పు అవగతమైనది. ఇదే మార్పు ఇటీవల కథలలో మళ్లీ చూడడం జరిగింది. ఇది సహజ మార్పే.

మరో విషయం, అమెరికా డయాస్పోరా కథలు రాస్తున్న చాలా మంది రచయితలు, రచయిత్రులు యాభై ఏళ్ళు దాటిన వాళ్ళే.  ఇరవై, ముప్పై లో ఉండి కథలు రాస్తున్న వారు 10% కూడా లేదని నా అంచన. ఇక ఇక్కడే పుట్టి పెరిగిన రెండవ తరం ప్రవాసాంధ్రులలోనుంచి, వచ్చిన తెలుగు కథలు చడవలేదు.  తెలుగు నేర్చుకోవాలంటే చాలా మటుకు భారతదేశంలోనే నేర్చుకోవాలి, లేకపోతే 'మన బడి' లాంటి కార్యక్రమాల వల్ల, ఇటీవల కొన్ని యూనివర్శిటీ  లలో నెలకొల్ప బడిన తెలుగు భాష విభాగాల వల్ల వీలవుతుంది.  ఇలా ఎంతమంది నేర్చుకుంటారు? చాలా తక్కువ సంఖ్యలోనే ఉంటారనుకుంటా. దాదాపు పదివేల మందిలో ఒక్కరు  రాస్తారు అనుకుంటే,   సెకండ్ జనరేషన్ లో తెలుగు కథలు రాసే వారు తక్కువే అనిపిస్తుంది. సాహిత్యాభిమానులకు ఇది సమస్యే. డయాస్పోరా రచనలు ఇమ్మిగ్రేషన్

మార్పుల మీద ఆధారపడి ఉందని నాకు అనిపిస్తుంది. ఈ దేశం పూర్తిగా ఇమ్మిగ్రేషన్ ఆపేస్తే, ఓ 30 ఏళ్లలో తెలుగు కథ అంతరించి పోతుంది అంటే మరీ అంత అతిశయోక్తి కాదేమో.

నేనో ఆశావాదినే. ఇలా ఓ వీరబ్రహ్మ స్వామి వాక్కు లాంటి మాటలతో ముగించడం సరికాదు. కోయంబత్తూరు, మధుర, శ్రీలంకలలో ఎన్నో తరాలుగా బ్రతుకుతూ, ఇంకా బాగా మార్పులు కలిగిన తెలుగులో మాట్లాడు తున్న తెలుగు వారే మానకు నిదర్శనం. ఇంతకు మించి తెలుగు కథ ప్రపంచమంతా పచ్చగా బ్రతకడానికి టెక్నాలజీ సహాయ పడుతుంది అని నా గట్టి నమ్మకం. AI లాటి ప్రగతితో, రచయిత రచయిత్రి చెప్తుంటే, తెలుగులో కథ లిపిలోనే కాక, ఓ వీడియో గాను చిత్రీకరించి , పాఠకులకు, వీక్షకులకు అందజేసే సమయం అట్టే దూరం లేదని నా అంచన. భారత్ దేశంలో ఉన్నా, డయాస్పోరా తో బాటు వలస పోయినా, తెలుగు కథ చిరంజీవినే.